క్లుప్తంగా

గోదాము తనిఖీ



బ్యాలెట్ బాక్సులు, సామగ్రిని పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్ : మున్సిపల్ కార్యాలయం పక్కనున్న గోదామును మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. గోదాములో వృథాగా పడి ఉన్న పరికరాలు, బ్యాలెట్ బాక్సులు, అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనికొచ్చే సామగ్రిని నిల్వ ఉంచి, వ్యర్థాలను తొలగించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

ఆస్తి పన్ను కట్టలేదని దుకాణాలకు తాళం



దుకాణాలకు తాళం వేసిన దృశ్యం

ఆదోని అర్బన్ : ఆస్తి పన్ను కట్టలేదని స్థానిక కొత్త బస్టాండు వద్దనున్న రాచప్ప కాంప్లెక్స్ దుకాణాలకు మున్సిపల్ అధికారులు శనివారం తాళం వేశారు. దీంతో వాటిల్లో బాడుగ ఉన్న వ్యాపారులు లబోదిబోమంటూ అధికారులను నిలదీశారు. కాంప్లెక్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలే గానీ ఒక్కసారిగా ఇలా తాళాలు వేయడం ఏమిటని అధికారులను నిలదీశారు. పక్కనే ఉన్న టీడీపీకి చెందిన ఓ దుకాణాన్ని ఎందుకు తాళం వేయలేదని ప్రశ్నించారు. వారికి ఒక న్యాయం, తమకొక న్యాయమా అంటూ ఆందోళన చేపట్టారు.

సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపిక



శివకుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత మురళీబాబు శనివారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ కనబరిచాడన్నారు. మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు మణిపూర్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ స్వామినాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి, అగసలదిన్నెలోని ఆలయాల్లో స్వామి వారి ఆలయాలను భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకొని పూజలు చేశారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి వివిధ పూజలను చేపట్టారు. బుదుముల దొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పూజలు చేసి ఉత్సవమూర్తులకు రథోత్సవం నిర్వహించారు.

దేవర ప్రశాంతంగా జరుపుకోండి



పెద్దహరివాణంలో కలియతిరుగుతున్న సీఐ మహేశ్వర్‌రెడ్డి

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఈనెల 28, మార్చి 1వ తేదీన జరగబోయే గ్రామ దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని ఆదోని తాలూకా సీఐ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం రాత్రి గ్రామంలో ఆయన పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేవర కార్యక్రమాన్ని సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఇస్వీ హెడ్ కానిస్టేబుల్ ఓబులేష్, సిబ్బంది, నాయకులు మెడికల్ నాగరాజు, హనుమంతరెడ్డి, సర్పంచ్ రాముడు, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫికర్..



గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

- కోసిగిలో పెరుగుతున్న వాహనాల రద్దీ
- రైల్వే గేటు పడితే ప్రయాణికులకు కష్టాలే
- చెన్నై–ముంబయి మార్గంలో పెరిగిన రైళ్ల సంఖ్య
- రైళ్ల రాకపోకలతో ప్రతి పదిహేను నిమిషాలకోసారి గేటు మూత
- భారీగా నిలిచిపోతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు, ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే శాఖ అధికారులు

కోసిగి: మండల కేంద్రంలో రైల్వే గేటు కష్టాలు తీవ్రమైయ్యాయి. చెన్నై– ముంబాయి ప్రధాన రైల్వే మార్గం కోసిగి మీదుగా వెళ్తుంది. నిత్యం రైళ్ల రాకపోకలు పెరిగిపోవడంతో రద్దీ అధికమైంది. కోసిగి మీదుగా కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. అలాగే కోసిగి మీదుగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడమూరు నుంచే కాక కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి వాహనాలన్నీ కోసిగి మీదుగా వెళ్లే క్రమంలో రైల్వే గేటు దాటాల్సి వస్తుంది. ఒకవైపు వాహనాల రాకపోకలు, మరో వైపు పెరిగిన రైళ్ల సంఖ్యతో గేటు పడిన ప్రతి సారీ భారీగా వాహనాలు నిలిచిపోతున్నారు. దాదాపు అటు,ఇటు కిలోమీటర్‌కు పైగా వాహనాలు నిలిచిపోతాయంటే రద్దీని అర్థం చేసుకోవచ్చు. ఇక గేటు తీసిన వెంటనే ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాలు ముందుకు వెళ్లలేక నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు వేచి ఉండలేక నరకయాతన అనుభవిస్తున్నారు. రైల్వే అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది.

పెరిగిన రైళ్ల రద్దీ..

కోవిడ్ కారణంగా కేంద్ర ప్రభుత్వం రైళ్ల సంఖ్యను భారీగా తగ్గించిన విషయం తెలిసిందే. అయితే ఏడాది నుంచి వాటిని పునరుద్ధరించడమే కాకుండా అదనంగా మరిన్ని రైళ్లను నడుపుతోంది. ముఖ్యంగా చెన్నై – ముంబాయి ప్రధాన రైల్వే మార్గం కోసిగి మీదుగా వెళ్తుండటం, అలాగే ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు గూడ్స్‌ల రాకపోకలు పెరిగిపోయాయి. ఉదయం 7 నుంచి సాయంకాలం 7గంటల వరకు 37 రైళ్లు, రాత్రి 7 నుంచి ఉదయం 7గంటల వరకు 42 రైళ్లు కోసిగి రైల్వే స్టేషన్ మీదుగా వచ్చివెళ్తున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ లెక్క రోజుకు దాదాపు 80 రైళ్లు వచ్చి వెళ్తుండటంతో ప్రతి పదిహేను నిమిషాలకొకసారి గేటు వేయాల్సి వస్తుంది. రైలు రావడానికి పదినిమిషాలకు ముందే గేటు వేస్తున్నారు. అలాగే రైలు వెళ్లిన మూడు నుంచి ఐదు నిమిషాల వరకు గేటు తీయడం లేదు. గేటు తీసిన తరువాత దాదాపు పదిహేను నిమిషాల పాటు వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. వాహనాల సంఖ్య పరిమితమైందనుకునే లోపు మరోసారి గేటు పడుతుంది. ఇలా సమస్య తీవ్రంగా మారింది. ఇలా గేటు వద్ద దాదాపు అరగంట పాటు వాహనదారులు వేచి చూడాల్సి వస్తుంది.ఇక అత్యవసరం సమయాల్లో, అంబులెన్స్ వచ్చినా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిందే. ఇటీవల గర్భిణులు ప్రసవం కోసం అంబులెన్స్‌లో వచ్చిన సమయంలో గేటు పడడంతో ఆలస్యమవుతుంది. ఆసుపత్రికి చేరుకునే లోపు అంబులెన్స్‌లో ప్రసవాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసి రైల్వే గేటు కష్టాలు తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



గేటు తీసిన సమయంలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గేటు పడితే అరగంట ఆగాల్సిందే



మాది అగసనూరు గ్రామం. ఊరి నుంచి ప్రతి పనికోసం రోజూ కోసిగికి వచ్చి వెళ్తుంటాం. గ్రామం నుంచి గేటు దాటుకొని రావాలి. ఒక సారి గేటు పడితే అరగంట పాటు ఆగాల్సి వస్తుంది. అత్యసరమైతే చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గేటు కష్టాలు తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– ప్రహ్లాద, అగసనూరు గ్రామం

ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది



ఆదోని నుంచి వచ్చి రోజూ జంపాపురం, ఐరన్‌గల్లు గ్రామాల్లో వివిధ ఆలయాల్లో పూజారిగా విధులు నిర్వరిస్తున్నాను. ప్రతి రోజు ఉదయం సాయంకాలం వేళల్లో గేటు దాటి వెళ్లేటప్పుడు గేటు వద్ద తీవ్ర ట్రాపిక్ సమస్య ఏర్పడుతోంది. సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యామ్నాయం చూపాలి.

– శంబులింగయ్య, ఆదోని

గడువు పొడిగించాలి

ఆదోని అర్బన్ : డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజు తేదీ గడువు పెంచాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్‌ఎఫ్) నాయకులు కోరారు. శనివారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆందోళనకు దిగారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఫీజుతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజును కట్టించుకోవాలన్నారు. నాయకులు అఫ్రిద్, హరికృష్ణ, భీమా, పవన్, అజయ్, నవీన్ పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరు

కౌతాళం: గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. రాజనగర్ క్యాంపు వద్ద ఉన్న ఎస్‌ఎస్ ట్యాంకును శనివారం పరిశీలించారు. పంచాయతీ, ట్యాంక్ సిబ్బందితో మాట్లాడి ఫిల్టర్ బెడ్‌లు, పంపింగ్ మోటార్ల పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పైపులు లీకేజీపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారిస్తామని చెప్పారు.

ప్రతిఘటన ర్యాలీకి తరలిరండి

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కేంద్రంలో ఈ నెల 27న చేపట్టనున్న కన్నడిగుల ప్రతిఘటన ర్యాలీకి తరలి రావాలని హొళగుంద, ఆదోని, పెద్ద హరివాణం, కౌతాళం తదితర ప్రాంతాల కన్నడ సంఘాల నాయకులు దొడ్డ బసప్ప, ఊకూరు కాడప్ప, పంపాపతి, శివశంకర్‌గౌడ్, ఎర్రిస్వామి, పోతరాజు, కబీర్, ఏకే మారెప్ప, గురు బసవరాజు తదితరులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఆంధ్రలో ఉంటున్న కన్నడిగులు, కన్నడ విద్యార్థులు కర్ణాటకలో విద్యా, ఉద్యోగ పరంగా తీవ్ర అన్యాయానికి గురతున్నారన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఇక్కడి కన్నడిగులను 'గడినాడు కన్నడిగులు'గా గుర్తించి విద్యా, ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ ర్యాలీ చేపట్టనున్నామన్నారు.

పందుల బెడద నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజారెడ్డి, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్

కోసిగి: మండల కేంద్రంలో పందుల బెడదను నివారించేందుకు పంచాయతీ పరిధిలో శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో సమావేశంలో ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇటీవల పందులు సంచారం అధికమవడంతో ప్రజలపై దాడులు చేస్తున్నాయని, అలాగే పంట పొలాలను నాశనం చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయని చెప్పారు. దీంతో పందుల బెడద నివారణకు వాటి యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. వాటిని గ్రామానికి మూడు కి.మీ. దూరం తరలించాలని సూచించామని, అలా తరలించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన సభ్యులు

ఆదోని అర్బన్ : స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం పట్టణ నూతన కమిటీ ఎన్నికలు శనివారం జరిగాయి. ఇందులో పట్టణ శాఖ అధ్యక్షుడిగా సునీల్‌రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, సహాధ్యక్షులుగా గిరిబాబు, శకుంతల, ఆర్థిక కార్యదర్శిగా జగన్‌మోహన్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఫయాజుద్దీన్, రాహుల్‌అమీన్, అమనుల్లా, కార్యవర్గ సభ్యులుగా నాగేష్, రంగన్న, నరసయ్య, మహేష జహంగీర్, రుషికేశవ్, ఇమ్రాన్, చక్రపాణి, విష్ణు, సాదిక్, సల్మాన్, సుధాకర్, శ్రీనివాసులు, మహిళా విభాగం కన్వీనర్‌గా పరిమళ, భాగ్యరేఖ, సువేదమ్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సునీల్‌రాజ్‌కుమార్, మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు డీడీఓ అధికారాలు కోసం పోరడగా నేడు జీవో నంబర్ 84 విడుదలైందని చెప్పారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

ఆలూరు: చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ డాక్టర్ బాల మురళీకృష్ణ సూచించారు. దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో పీహెచ్ సబ్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారుల వివరాలు, వారి ఆరోగ్యం కండీషన్‌పై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట దేవనకొండ పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌భాస్కర్, సీహెచ్‌ఓ భాగ్యమ్మ, ఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఆటో-బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు



గాయపడిన ధనుంజయ

ఆదోని రూరల్ : మండలంలోని కపటి గ్రామ సమీపంలో ఆటో–మోటార్ సైకిల్ శనివారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇస్వీ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కపటి గ్రామానికి చెందిన తండ్రి వీరేష్, కుమారుడు ధనుంజయ పొలం పనులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. పెసలబండ గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులతో వెళ్తుండగా గుంతలను తప్పించే క్రమంలో వెనక నుంచి వచ్చి బైక్ ఢీకొట్టింది. దీంతో తండ్రీ కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలోనున్న ప్రయాణికుడు గిడ్డయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'అప్పర్‌భద్ర' నిర్మాణ పనులు ఆపాలి

కోసిగి: కర్ణాటక హొస్పేట్ డ్యాం పైన బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అప్పర్‌భద్ర డ్యాం నిర్మాణ పనులను ఆపి తుంగభద్ర నికర జలాలను కాపాడుకుందామని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మెన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలోని రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్టు వద్ద రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో తుంగభద్ర నదిలో పూజలు చేసి అక్కడ నుంచి ఆదోని వరకు పాదయాత్ర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్ర నాలుగు రోజులు పాటు కొనసాగుతుందని, ఈనెల 28న ఆదోని చేరుకుని అక్కడ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అప్పర్ భద్ర డ్యాంతో రాయలసీమ ప్రాంతం, తెలంగాణలో మహబూబ్ నగర్ జిల్లాకు నికర జలాలు రాక ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాదయాత్రకు ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్లు నాగన్న, అమ్రేష్, బతుకన్న సంఘీభావం తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మంత్రాలయం రూరల్: మండల ంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకు ఎస్ఐ కిరణ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు దిశ చట్టం వినియోగం గురించి క్లుప్తంగా వివరించారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం అమలు గురించి వివరించారు.

మృతదేహం లభ్యం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన జయన్న (55) అనే వ్యక్తి నాలుగు రోజుల క్రితం అదృశ్యమై శుక్రవారం స్థానిక శ్మశానవాటిక పక్కనే శవమై కనిపించాడు. భార్య నాగమ్మ త్రీటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. తన భర్తకు గత కొంతకాలంగా మతిస్థిమితం లేదని, చాలా ఆస్పత్రుల్లో వైద్యం చేయించామని, అప్పుడప్పుడు ఇంటి నుంచి నాలుగైదు రోజులు వెళ్లి మళ్లీ తానే వచ్చేవాని, ఈసారి కూడా అలానే వెళ్లాడనుకున్నామని ఫిర్యాదులో పేర్కొంది.

తీరిన రహదారి ఇక్కట్లు





నాడు..వైఎస్సార్ సర్కిల్ నుంచి వంకకు వెళ్లే రోడ్డు, నేడు.. డబుల్ సీసీ రోడ్డుగా మారిన దృశ్యం

కౌతాళం: దశాబ్ద కాలంగా ఆరోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు, భక్తులు,స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పలుమార్లు నాయకులు, అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో స్థానికులు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి వంక వరకు ఉన్న 290 మీటర్ల రోడ్డు గుంతలు పడి నడవడానికి కూడా కష్టంగా ఉండేది. దీనిని పూర్తి చేయాలని గత ప్రభుత్వం హయంలో ఎన్నో సార్లు విన్నవించుకున్నా పెడచెవిన పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇక్కట్లను గమనించి సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేయించడంతో రోడ్డు నిర్మాణం పూర్తయి, ప్రజల ఆకాంక్ష నెరవేరింది. దీంతో ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు హాల్వి, బంటకుంట, సుళేకేరి, మదిర, పొదలకుంట, గోతులదొడ్డి, గుడికంబాలి వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం ఈరోడ్డు గుండా వెళ్లాలి. అలాగే కర్ణాటక నుంచి వచ్చే వాహనాలన్నీ ఉరుకుందకు వెళ్లాలన్నా, మంత్రాలయం, రాయచూర్ వెళ్లడానికి ఈ దారే ప్రధాన రహదారి. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఇక్కట్లు తప్పాయని స్థానికులతో పాలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

- 12 తులాల బంగారం, రూ.5,500 నగదు అపహరణ



ఇంటి ఆవరణ పరిశీలిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీరామ్‌నగర్ కాలనీలో శనివారం సాయంత్రం చోరీ జరిగింది. వెంకటరెడ్డి, జయలక్ష్మి వృద్ధ దంపతులు తెలిపిన వివరాల మేరకు.. సాయంత్రం 5 గంటల సమయంలో వాకింగ్ కోసం వెంకటరెడ్డి ఇంటికి తాళం వేసి బయట రెండు కుర్చీల మధ్య తాళం పెట్టి ఆర్ట్స్ కళాశాలలోని గ్రౌండ్‌కు వెళ్లారు. భార్య పనినిమిత్తం బయటకు వెళ్లిందని, ఆమె ఇంటికొస్తే ఆ తాళం తెరుచుకుంటుందని అక్కడే తాళం ఉంచాడు. వాకింగ్ ముగించుకుని వెంకటరెడ్డి, పని ముగించుకుని జయలక్ష్మి ఇంటి తాళం తెరిచి చూశారు. అప్పటికే బీరువాను పగలగొట్టిన దుండగులు 12 తులాల బంగారం, రూ.5,500 నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి పరిసరాలను పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా ఓబులేశుడి ఉత్సవం

ఆస్పరి: మండలంలోని తొగలగల్లు గ్రామంలో శనివారం ఓబులేశు స్వామి ఉత్సవం ఘనంగా జరిగింది. ఓబులేశు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఊరేగించారు. గ్రామంలో నుంచి స్వామి వారి కొండ వరకు పల్లకీని లాగారు. నందికోలు, బుక్కపిండి సేవ, నుగ్గులాట తదితర కార్యక్రమాలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ యువకులు వసంతోత్సవాన్ని ఉల్లాసంగా నిర్వహించుకున్నారు.

వేడుకగా గురుభక్తి ఉత్సవాలు

మంత్రాలయం : ప్రముఖ రాఘవేంద్ర స్వామి గురు భక్తి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం యోగీంద్ర మంటపంలో పలువురు ప్రముఖులకు పీఠాధిపతి పీఠాధిపతి సభుదేంద్ర తీర్థులు రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేశారు.



ఉత్సవాలకు హాజరైన భక్తులు





అవార్డు అందుకుంటున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి రవి చీమాలపాటి, ప్రముఖ్య వైద్యురాలు కామిని ఏ. రావు



అవార్డు అందుకుంటున్న ముంబాయి హైకోర్టు జడ్జి కేఆర్ శ్రీరామ్